# మూగవీణ

రచన:
శ్రీ. జీ. రాఘవేంద్రరావు.

ఆఫీసునుంచి చంద్రం బయటకు వచ్చేసరికి చీకటి పడింది. శీతాకాలం కావటం మూలాన ఆరుగంటలకే చీకటి ఆవరించింది. ప్యూనుతో తలుపు వేసుకోమని చెప్పి రోడ్డుమీద నడక ప్రారంభించేడు.

అప్పుడే చలిగాలి కూడా వీస్తోంది. అధమం ఆరు ఫర్లాంగులు దూరంవుంటుంది ఆఫీసునుంచి చంద్రంయిల్లు. అడుగులు గబగబా పడుతున్నాయి. తనకు కొద్ది దూరంలో ఒకడు నడుస్తున్నాడు. మధ్యలో దగ్గుతూ వున్నాడు. తను అతన్ని సమీపించేసరికి అతనికి పెద్ద దగ్గు తెరవచ్చి క్రింద కూలబడి పోయాడు. నలుపక్కలా ఎవరూ నడవటం లేదు. మానవ సహజమైన జాలి కలిగి, అతనివద్దకు వెళ్ళి 'ఏమయిందండి' అని ప్రశ్నించాడా అపరిచిత వ్యక్తిని. అతను సమాధానంగా తల అడ్డంగా తిప్పాడు.

'ఎంతవరకు వెళ్లాలి?' 'పరలోకం వరకు' ఆశ్చర్యపడే సమాధానం. ఆశించని జవాబు. జీవితంపై విరక్తి పుట్టిన వ్యక్తిలా కనిపించాడు.

అటుగా వెళ్లే టాక్సీ హెడ్ లైట్లు కాంతిలో మొహం చూశాడు చంద్రం. ఎక్కడో చూసినట్లు అజ్ఞాత భావాలు కలిగాయి. స్ఫురణకు తెచ్చుకొనేందుకు ప్రయత్నించి సఫలుడయ్యాడు.

'మీ పేరు సుదర్శనరావుగారా ఏం?' అంతవరకూ ఆయాసంతో కూర్చున్న మనిషి టక్కున తలఎత్తి చూశాడు. 'మీ కెలా తెలుసు' నిముష నిముషానికి అతని లోని ఆయాసం తగ్గుతున్నా, చంద్రంలోని ఆవేదన అధికమవజొచ్చింది. అక్కడ అతని ఆఖరు ప్రశ్న- 'మీది హైద్రాబాదేనా'

'మీ కీ విషయాలన్నీ ఎలా తెలుసు' అంటూ ఆశ్చర్య పోయాడవతలి వ్యక్తి.

'నన్ను మీరు గుర్తింపక పోవచ్చు బావగారూ. కానీ మిమ్మల్ని నేను పోల్చాను. నేను ఉష తమ్ముణ్ని. లేవండి యింట్లో మాట్లాడుకోవచ్చు' అన్నాడు. అప్పటికే యిద్దరు ముగ్గురు రోడ్డుపై వ్యక్తులు తమను గమనించడం వలన, రానని అడ్డు చెప్పినా, బలవంతము మీద యిద్దరూ రిక్షాలో యింటివైపు దారితీశారు.

చంద్రానికి ఉష స్వంత అక్కయ్య. వారి తల్లిదండ్రులకు ముద్దుముచ్చటగా యిరువురూ జన్మించారు. ఇద్దరికీ నాలుగు వత్సరాలకన్న తేడా లేదు. చంద్రానికి అక్కయ్యపై అపేక్ష, అభిమానం మెండు. బాల్యము సామాన్యంగానే గడచింది.

యౌవ్వనము ప్రవేశించినపుడు స్త్రీ పురుషులు కొన్ని పద్ధతుల నవలంబించి వాటినే జీవితాంతం వరకు కొనసాగిద్దామని వూహిస్తారు. అటువంటి జీవుల్లో ఉషని కూడా లెక్కపెట్టవచ్చు. తన క్లాసుమేటు, నాటకాలపై ఎక్కువ మోజు చూపించే సుదర్శనాన్ని ప్రేమించి, పెళ్ళాడతానని పట్టుబట్టిందంటే.....పట్టనూ వచ్చు.

కానీ మన చుట్టుపట్ల సంఘం? ఆ సంఘాన్ని వివిధ రూపాల్లో యిముడ్చుకున్న లోకం వూరుకోదు. అందుకని యింట్లో తల్లిదండ్రుల అనుమతి కూడా ఆమెకు కరువైంది. ఆ వంశంలో ఒకవైపు ఏవిధమైన కళంకము లేకుండా వుండడము చేత ఆ తల్లిదండ్రులు వేరొకవైపు కూడ అలాగే వుండాలనే ఆశించడంలో కూడా తప్పు లేదనిపిస్తుంది. ఎవరి నిశ్చయాన్ని ఎవరూ వీడలేనప్పుడు యిటువంటి పరిస్థితుల్లో ముఖ్యంగా ఎడబాటు తప్పదు.

తమ కులం కాదని ఎన్ని నీతులు బోధించినా తన కర్మ తాను అనుభవిస్తానని ఆ యిల్లు వదలి సుదర్శనరావుతో వెళ్ళిపోయింది ఒకనాటి రాత్రి. (లోకుల మాటల్లో ఉష లేచిపోయింది.)

తన క్షేమ సమాచారం తరువాత తెలియపరచి, తమ యిద్దరూ కలసి తీయించుకొన్న ఫోటోకూడా పంపింది. చంద్రం దృష్టిలో అక్క చేసిన పని అపవిత్రముగా కనిపించలేదు. తన కిష్టమైన వానిని ఎన్నిక జేసుకొని వానితో జీవితాన్ని స్వర్గం చేసుకోవాలని ప్రతి స్త్రీ కోరిన కోరికే కోరి నెరవేర్చుకుంది. అది అందరి అధరాభిమానాలతోనూ కాకపోవచ్చు. ఆ తరువాత దాని ప్రతిఫలం మంచిదైనా, కాకపోయినా అనుభవించడానికి సిద్ధపడే వుంటుందా స్త్రీ.

ఆమె వివాహం గురించి చంద్రకూడా యింట్లో కలుగజేసుకొన్నా, అది ఖండితమయింది. తను అప్పుడు మాటలాడకుండా వూరుకున్నాడే గాని, ఆమెనుమటుకు మనసు మార్చ ప్రయత్నించలేదు.

తరువాత ఫొటోలో ప్రత్యేకంగా చంద్రానికి వుత్తరం వ్రాసింది. తను ఎక్కడవున్నా తన ఆశీస్సులు అభిస్తాయనీ, వీలైతే ఒకసారి రమ్మనీ మరీ మరీ వ్రాసింది. జవాబులో ఆమె సాహసాన్ని అభినందిస్తూ వ్రాసాడు. ఆ తరువాత ఎందుకోగాని వుత్తరాలు లేవు. తను అక్కడకు వెళ్ళనూ లేదు.

కానీ యీనాడు అనుకోకుండా బావగారిని గుర్తుపట్టి తీసుకొచ్చాడు. అప్పుడు ఫొటోలో కన్నా బాగా మారిపోయాడు. మనిషి సన్నగా ఎముకలపోగుగా వున్నాడు. మనిషిని చూసే సరికి, అతని జబ్బు క్షయం అని తెలుసుకోవచ్చు.

రిక్షాదిగి యింట్లోకి నెమ్మదిగా నడిపించి తీసుకొని వెళ్ళాడు. చంద్రం తల్లి ఎదురువచ్చి 'ఎవరురా చంద్రం' అంది.

'చెప్తానుగాని ముందు మంచం వాల్చి పక్కవెయ్యి' అన్నాడు. సుదర్శనాన్ని దానిమీద పడుకోబెట్టి ఆమెను లోపలకు తీసుకొని వెళ్ళి చెప్పాడతనెవరో 'అయితే అమ్మ యెక్కడవుంది. ఇతనిక్కడేంచేస్తున్నాడు ? అలా ఎందుకున్నాడు అని అమ్మ ప్రశ్నలేగాక.చంద్రం సందేహాలు కూడా. నెమ్మదిగా అడగవచ్చునని పూరుకున్నాడు. ఆయనకు కాస్త వేడి కాఫీ యిచ్చి 'పడుకోండి. కాస్త నీరసం తగ్గుతుందేమో!'' అన్నాడు.

'ఇప్పుడు బాగానే వుంది. మీ ఆదరాభిమానాలకు కృతజ్ఞుడను. కానీ వాటన్నిటికీ తగనేమో ననిపిస్తూంది' అన్నాడు, ఏదో కలకలం జరిగినట్లుంది అనుకొని ''అయితే అక్కయ్య...'' ఆ: ప్రస్తుతం హైద్రాబాద్‌లోనే వుండివుంటుంది. ఆమెను తలచుకొంటేనే నాకు బాధ కలుగుతోంది. అని ఆట్టే ఆలస్యం చెయ్యకుండా అతను యిలా చెప్పాడు.

''మేము యీ వూరునుంచి బయలుదేరి హైద్రాబాద్ వెళ్ళాము. నా కక్కడ వుద్యోగం యిచ్చి, స్వాగతం పలకడానికి ఎవరున్నారు గనుక నాలుగు రోజులు కాళ్ళు అరిగాయి. ఏ పెట్టుబడి సంస్థలోకూడా నాకు చోటు దొరకలేదంటే ఆశ్చర్యపడవలసిన అవసరం లేదు. అప్పటికే నా స్నేహితుని యింటిలో దిగి ఐదు రోజులు దాటింది. పాపం, వాడు కూడా నా గురించి శ్రద్ధవహించి ఒకట్యూటారియలు స్కూలులో కొన్ని గంటలు అప్ప చేప్పాడు. ఆ ఆదాయమువలన నిలబడ గలమని ధైర్యంకలిగి, స్నేహితుని ఆతిథ్యానికి, సౌమ్య హృదయానికి కృతజ్ఞతలు తెలియజేసి, అక్కడకు కొద్ది దూరములోనున్న చిన్న యింటిలో, ఒక ప్రక్క మేము వుండే వాళ్ళము. నాకు ఒక్కొక్క సారి ఆలోచనలలో యీ జీవితము ఎలా సాగుతుంది అనే భీతి కలిగి జలదరించేవాడిని.

స్కూలువాళ్ళిచ్చే ఎనుబదిరూప్యములు ఏమూలకి ? ఉషను కూడా నేను కష్టపెట్టవలసి వస్తోంది అని బాధ పడేవాణ్ణి. కానీ ఆమె 'జీవితం అన్నాక యిటువంటి వాటిని చాలా చూడవలసివస్తుందని' నన్నూరటపెట్టేది. జీవితంలో ముందు వెనుకలు చూడక పరుగెత్తేవాడికి, స్థిరత్వం ఒకంతట సమకూడదు.

అప్పుడుకూడ నాకు నాటకాలమీద మోజుకొద్దీ కొన్ని డ్రామా కంపెనీల పరిచయంతో నాటకాలు వేసేవాడిని, అది ఎంతవరకు వచ్చిందంటే, అన్నిటైమును ఆ నాటకాల్లోనే గడిపేవాణ్ణి. అటువంటి నాకు వున్న కాస్త జీవనాధారమైన ఆ వుద్యోగం పోయింది. అప్పటి దాకా నేను చేస్తున్న సేవ కళామతల్లికైనా, యిక మీదట మనల్ని ఎవరు పోషిస్తారు అని ఆలోచన రాలేదు. ఆ నాటకాలవల్ల వచ్చిన రాబడిలో పూర్వం కన్నా తక్కువగా జీవించేవాళ్ళము. అటువంటి స్థితిలో కూడా ఆమె వుద్యోగం చెయ్యడమనే విషయం నేను ఒప్పుకోలేదు.

యౌవనంలో వున్నటువంటి స్త్రీకి వుండే సరదాలను నేను ఏమీ ఉషకు తీర్చలేకపోయాను. ఎప్పుడూ సరదాగా సినిమాకుగాని, షికారుకుగానీ వెళ్ళినట్లు గుర్తు లేదు. రాత్రింబవళ్ళు డ్రామాసెట్లవద్ద పనిచేసే నాకు ఆరోగ్యం క్షీణించడం మొదలుపెట్టింది. దగ్గువచ్చేది. మొదట్లో నిర్లక్ష్యం చేసినా, ఉష పోరువల్ల గవర్నమెంటు హాస్పిటలు మందు త్రాగేవాణ్ణి. దేనికన్నా పథ్యం చెయ్యడం నా జీవిత పుటల్లోనే లేదు. అందువలన ఔషధ ప్రయోజనం కలుగలేదు. దగ్గు ఎక్కువ అయింది. ఆయాసంకూడా దానికి తోడైంది. అటువంటివాడిని యిక నాటకాలు ఏమి వేయగలను ? అది తెలిసి వాళ్ళే నాకు స్వస్తి చెప్పారు.

ఇక జీవితం ఎలాగ గడుస్తుంది ? రోగియైన, క్షయ వ్యాధి పీడితుడైన భర్తతో ఎలా జీవిస్తుంది. జీవనానికి

ఆదాయం ఏది? అర్థం, అనుభవం లేని ప్రశ్నలు. సమాధానం ఆపేక్షించని ప్రశ్నలు. నేను నా జీవితంలో ఉషకు అన్యాయం చేశాను. అటువంటి సమయంలో ప్రతీ పిరికివాడూ, మతి లేనివాడూ చేసేపని నేనూ చేశాను. ప్రపంచంలోకి పారిపోయి వచ్చాను. నా ఉషను ఒంటరిగా వదిలేసి వచ్చాను.' అని ఆవేశంగా చెప్తూ ఒక్కసారి పెద్ద దగ్గు దగ్గాడు. నోట్లోంచి రక్తం పడింది. 'బావగారూ ఏమిటిది' భయకంపితుడై చంద్రం అడిగాడు.

'జీవితంలో సరియైన మార్గములో నడవని ప్రతీ వ్యక్తికి అంతములో కలిగే పరిణామం అప్పటినుంచి తోచినచోటల్లా ఉన్మాదునిలా తిరుగుతూ వున్నాను. నేడు నీకంట బడ్డాను' అన్నాడు.

'అయితే ఉష అక్కడే వుండి వుంటుందా' అని చంద్రం ఆత్రంగా ప్రశ్నించాడు. అనుకున్నంతా చేశాడు. నా బంగారు తల్లి ఏమయిందో, ఏ అవస్థ అనుభవిస్తోందో అమ్మా ఉషా, అని అమ్మ రాగాలు తీస్తోంది. 'అత్తగారూ నేనొక మహాపాపిని. నాకు దేవుడు తగిన శిక్ష వేశాడని తలుస్తున్నాను.' దగ్గుతూ అన్నాడు. 'పోనీ టెలిగ్రాం యిచ్చి చూస్తాను అడ్రసు యివ్వండి' అని ఎడ్రసు రాసుకొని బయటకు పరుగెత్తాడు, 'మీరు విశ్రాంతి తీసుకోండి డాక్టరును పంపుతాను' అంటూ.

ఆ ఎడ్రసుకు బావగారు యిక్కడ వున్నారనీ, ఆరోగ్యం బాగా లేదని, వెంటనే బయలుదేరి రమ్మని టెలిగ్రాం యిచ్చాను. డాక్టరు వచ్చి సుదర్శనాన్ని పరీక్షించి పెదవి విరచాడు. అయినా యింజక్షను మొదలైనవి యిచ్చి వెళ్ళాడు.

మూడోరోజుకల్లా ఎక్స్‌ప్రెసు డెలివరీకవరు వచ్చింది. ఉష వస్తుందనుకుంటే వుత్తరం వచ్చిందని అనుమానంతో కవరుచించి చూశాడు. అందులో సుదర్శనానికి చెందవలసిన కవరు ఒకటి, చిన్న కాగితంవున్నాయి, ఆ కాగితంలో టెలిగ్రాం అందిందనీ, ఉష నెలక్రితమే యిల్లు ఖాళీచేసి వెళ్తూ యిచ్చిన కవరు దీనితో పంపుతున్నానని యింటి యజమాని రాశాడు. "బావగారూ! ఉష ఎక్కడికో వెళ్ళిపోయింది. మీ పేరు ఈకవరు..."

"విప్పి చదువు చంద్రం" అన్నాడు సుదర్శనం లేచి కూర్చుంటూ. భయకంపితమైన హృదయంతో యిలా చదివాడు.

"పూజ్యశ్రీ పాదపద్మములకు,

మీ రెప్పుడో రావడంగాని, వుత్తరం రాయడం గాని జరుగుతుందనే యోచనతో యిది యింటివారికి యిచ్చి వెళ్తున్నాను. నేను మమ్మల్ని ధిక్కరించి వెళ్ళానని అనుకుంటే క్షమార్హురాలను. మీరు జీవితానికి భయపడి పారిపోయారు. ఇక్కడ మీ నీడలో బ్రతికే దాని విషయం ఆలోచించలేదు. బహుశా ఆలోచించినా వ్యర్థ ప్రయత్నం అయివుంటుంది. నేను ఒంటరిగా యిక్కడ ఏమి చేయలేను. మా పుట్టింటికి వెళ్ళమని మీరు చాలాసార్లు చెప్పారు. కానీ యిప్పుడే కాదు. ఎప్పుడూ వెళ్ళను. వారిని విడచి వారి అభ్యర్థనలను నిరాకరించి వచ్చిన దానిని వారిని మళ్ళీ ఆశ్రయించడం అవివేకం. అందుకని నేను మీ అనుమతి లేకుండానే యీ విశాల ప్రపంచంలోనికి వెళ్ళిపోతున్నాను. బహుశా విశాల ప్రపంచం సరిపోకపోతేదానికి కూడా దూరమవుదామనుకుంటున్నాను.

ప్రేమపట్ల నాకు అమిత విశ్వాసం వుండేది, తరువాత తెలిసింది, ప్రేమయందు విశ్వాసం గలవారికి దాని లోతుపాతులు తెలియవు. దానిపై మెరుపులే తెలుస్తాయి. కాని ఆ విశ్వాసం లేనివారికే ప్రేమయొక్క వైఫల్యాలు, విషాదాంతాలు తెలుస్తాయి. ఆ విశ్వాసం నాకు నశించింది. నా గురించి ఆరాటపడడం వృథా. మా వాళ్ళను కలుసుకుంటే వారికి నా మనోవాక్యాలు అందజేయండి. మీ ఆరోగ్యం జాగ్రత్తగా చూసుకుంటారని ఆశిస్తున్నాను. ఆవేశంలో ఏమైనా బాధ గలిగిస్తే క్షమించగలరు.

ఎప్పుడూ మిమ్మల్ని తలచే
ఉష.

ఉత్తరం చదవడం ముగించి కళ్ళను తుడుచుకుంటూ సుదర్శనరావు వైపు చూశాడు. అతను శాశ్వతంగా నిద్దురపోతున్నాడు. వీణమోగడం మానివేసింది. అంతే!